క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ఎస్.శేఖర్

గుమ్మలక్ష్మీపురం: మండల తహసీల్దార్‌గా (ఎఫ్ఏసీ) ఎస్.శేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భామిని మండలంలో హెచ్‌డీటీగా పనిచేస్తున్నా శేఖర్‌కు గుమ్మలక్ష్మీపురం హెచ్‌డీటీగా బదిలీ జరిగింది. అయితే ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అప్పారావుకు భామిని బదిలీ జరిగింది. ఆయన స్థానంలో నియమించిన తహసీల్దార్ నేటికీ విధుల్లో చేరకపోవడంతో శేఖర్‌కు ఉన్నతాధికారులు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పూర్తిస్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

అయ్యప్పస్వామి భక్తుల మాలాధారణ


భక్తులతో మాలాధారణ చేయిస్తున్న అర్చకులు తాతబాబు శర్మ

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో అయ్యప్పస్వామి భక్తుల మాలాధారణ కార్యక్రమం బుధవారం జరిగింది. అక్కడి నదీతీరంలో వెలసిన శ్రీలలిత త్రిపుర సుందరీదేవీ ఆలయ ప్రాంగణంలో గురుస్వామి కర్రి సంతు సారథ్యంలో భక్తులతో సంతోషిమాత ఆలయ ప్రధానార్చకులు రంపా తాతబాబు శర్మ మాలాధారణ చేయించారు.

సదరం సెంటర్ మంజూరు


సీతంపేట: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి సదరం సెంటర్ మంజూరైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. నవంబరులో సెంటర్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని, ఎక్విప్‌మెంట్, యూజర్ ఐటీ, పాస్‌వర్డ్ వంటివి ఇంకా రావాల్సి ఉందన్నారు.

అయ్య బాబోయ్ ఎంత పొడుగో..!


లక్ష్మణరావు ఇంటి పెరటిలో పెరిగిన పొడవైన బెండ మొక్క

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామంలో బలిజి లక్ష్మణరావు పెరటిలోని ఎర్ర బెండ మొక్క ఏకంగా 12 అడుగులు పెరిగింది. సాధారణంగా బెండ మొక్కలు మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తు వరకు పెరుగుతూ ఉంటాయి. అయితే ఇక్కడ పొడవుగా పెరిగిన బెండ మొక్కను చూసేందుకు చుట్టుపక్కల వారు క్యూ కట్టారు. అయ్య బాబోయ్ ఎంత పొడుగో అని ఆశ్చర్యపోతున్నారు. ఇంత పెద్ద మొక్క ఎలా అయిందని, ఇంటి యజమానిని ఆరాతీశారు. సేంద్రియ ఎరువులతో పెంచుతున్నానని, సాధారణ బెండకాయల కన్నా ఈ మొక్కకు కాసే కాయలు నాలుగు రెట్లు పెద్దవిగా ఉంటాయని ఆయన తెలిపారు.

దోమపోటు, తెగులుపై రైతులకు సూచనలు


నారాయణపురంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు

బలిజిపేట: దోమపోటు, తెగులుపై రైతులు ఎటువంటి మందులను వినియోగించాలి? ఏ జాగ్రత్తలు చేపట్టాలనే దానిపై ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు తగు సూచనలు అందించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురం, పెద్దింపేట గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంటపొలాలను పరిశీలించి కాటుక తెగులు, మెడవిరుపు తెగులును పరిశీలించారు. వాటి నివారణకు తగు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా దోమపోటు నివారణకు పిచిఎసిఫేట్ 1.5 గ్రాముల లేదా ఇథోఫెన్‌ప్రాక్స్ 2.0ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్ 0.25ఎంఎల్, లేదా ట్రీఫ్లూమేజాపైరిం 0.5ఎంఎల్ లేదా పైమెట్రోజిన్ 0.5గ్రాము లేదా డైనోటెఫ్యూరాన్ 0.4గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వెటర్నరీ శాఖా పరంగా రైతుల పశువులకు సంబంధించిన సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.పెదపాపినాయుడు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై
అవగాహన తప్పనిసరి

• ఏఓ విజయభారతి


పెదగుడబలో పంట పొలంలో ఎరువు వేస్తున్న రైతు

గరుగుబిల్లి : ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఆర్. విజయభారతి అన్నారు. పైరకు ఏ సమయంలో ఎరువులు వేయాలి.. వేసిన ఎరువులు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అన్న అంశాలను పట్టించుకోవాలని సూచించారు. ఈ మేరకు వరి సాగుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు.

సూచనలు.. సలహాలు..

- కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దమ్ములోనే వేయాలి. తగినంత తేమ లేకుండా నత్రజని ఎరువులు వేయడం వల్ల పంటకు పూర్తిస్థాయిలో పోషకాలందవు.
- పంట పొలాలలో ఎరువులు వేసినప్పుడు 2 సెం.మీ కన్నా నీరు ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. ఎరువులు చల్లిన రెండు రోజుల వరకు పొలానికి నీరు పెట్టకూడదు.
- వేసిన ఎరువులు పైరు వేరు బాగానికి అందేలా చూసుకోవాలి. అలాగే వేసిన ఎరువులు పై పొరలలో నిల్వ ఉంటే మాంగనీస్, జింక్, ఐరన్ లోపాలు తలెత్తుతాయి.
- పొటాష్ ఎరువులను దమ్ములోను, చిరుపొట్ట దశలో వేసుకొంటే మంచిది. పొటాష్ వేయడం వల్ల గింజ నాణ్యత బాగుంటుంది. అలాగే పైరుకు రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.
- నత్రజని ఎరువుల వినియోగంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. నత్రజని ఎరువు భూమిపై పడితే అమ్మోనియా రూపంలో ఆవిరైపోతుంది. తేమ ఎక్కువగా ఉంటే భూమి లోపల పొరలలోకి వెళ్లిపోతుంది.
- కాంప్లెక్స్ ఎరువులను కలుపుతీయడానికి ముందు వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కలుపుతీసే సమయంలో తొక్కుడుకు భూమిలో కలిసి మొక్కలకు పుష్కలంగా ఎరువు అందుతుంది.
- వేసిన ఎరువులు పంటకు అందాలంటే పొలంలో తగినంత తేమవుండాలి. లేకపోతే వేసిన ఎరువులు నేలలో కరగక గడ్డకట్టుకుపోయి అవసరానికి పనిచేయవు.
- నత్రజని, భాస్వరం, పొటాష్ ప్రధాన ఎరువులు కాబట్టి పంటలో ఎప్పుడు వేసుకోవాలి అనే విషయాలపై రైతులు అవగాహన కలిగి ఉండడం మంచిది.

పకడ్బందీగా అపార్ ఎన్‌రోల్‌మెంట్

• డీఈఓ పగడాలమ్మ


గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఆరా తీస్తున్న జిల్లా విద్యా శాఖాధికారి పగడాలమ్మ

గుమ్మలక్ష్మీపురం : జాతీయ విద్యా విధానం-2020 అమలులో భాగంగా మొదటి విడతగా 9, 10వ తరగతుల విద్యార్థులకు జారీ చేయనున్న అపార్ కార్డుల కోసం ఎన్‌రోల్‌మెంట్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ అన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, తాగునీరు, బడి తోట, మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. ఐదు, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. అనంతరం నాడు - నేడు పథకం పనులు ప్రారంభమై అర్ధంతరంగా నిలిచిపోయిన పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ భవనాలకు సంబంధించిన సూపర్‌వైజర్లతో ఎంఆర్‌సీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల వైపు పిల్లలెవ్వరూ వెళ్లకుండా రెడ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పాఠశాలల్లో బడి తోటలు అభివృద్ధి చేయాలని, అపార్ ఎన్‌రోల్‌మెంట్‌లో తప్పుల్లేకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... పార్వతీపురం మన్యం జిల్లాలో 9, 10 తరగతుల విద్యార్థులు 22,500 మంది ఉండగా ఇప్పటివరకు 14 శాతం అపార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తయిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బడితోటల సాగుకు సంబంధించి జిల్లాలోని 1283 పాఠశాలలకు కూరగాయలు, ఆకు కూరల విత్తనాలు సరఫరా చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించేందుకు మండల స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈమె వెంట ఎంఈఓ బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూఓ బి.సురేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

బెల్లంఊట ధ్వంసం


బెల్లంఊటను పారబోస్తున్న పోలీసులు

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సారాబట్టీలపై పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్ఐ వై.అమ్మన్నరావు, సిబ్బంది కలిసి 600 లీటర్ల బెల్లంఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలి


మరుగుదొడ్లు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో నారాయుడు

సీతంపేట: విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని డిప్యూటీ ఈవో పి.నారాయుడు సూచించారు. మండలంలోని దోనుబాయి గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. దసరా సెలవుల తర్వాత మొత్తం 310 మంది విద్యార్థుల్లో 190 మంది విద్యార్థులు మాత్రమే హాజరు కావడంతో పిల్లలను రప్పించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు గ్రామాలకు వెళ్లి, వారు రాకపోవడానికి గల కారణాలను తెలుసుకుని, త్వరగా వారు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని సీతంపేట రోడ్డులో ఉన్న ఐటీడీఏ వారి పెట్రోలు బంకు ఆవరణలో అగ్నిప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తొలుత ఏ విధంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి.. ప్రమాదం బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాహనాల్లో పెట్రోలు వేస్తున్న సమయంలో వాహనదారులు సెల్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని సిబ్బందికి తెలిపారు. అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు ప్రారంభం

పాలకొండ రూరల్:


నందెన్నను ఊరేగిస్తున్న భక్తులు

మండల కేంద్రంలోని దేవాంగుల వీధిలో నందెన్న ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం గౌరీ సమేత శివ పార్వతుల విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. అనంతరం గౌరీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ వేడుకలనే గౌరీ పౌర్ణమి ఉత్సవాలు అని కూడా అంటారని, ఎనిమిది రోజుల పాటు ఈ పండగ జరుగుతుందని వీధివాసులు తెలిపారు.

నిరసన


నినాదాలు చేస్తున్న ఈయూ నాయకులు

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో సహాయ మేనేజర్ తీరును వ్యతిరేకిస్తూ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులంతా డిపో ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఎర్రబ్యాడ్జీలు ధరించి, తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆ యూనియన్ నాయకుడు బీకే మూర్తి మాట్లాడుతూ డిపోలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, యాజమాన్యం స్పందించాలని కోరారు.

నీలకంఠాపురంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలంలోని నీలకంఠాపురం పీహెచ్‌సీ ఆవరణలో రూట్స్ సంస్థ సహకారంతో వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 112 మంది రోగులకు డాక్టర్లు తరుణ్, సురేష్, సిబ్బంది పరీక్షించి మందులు అందజేశారు. శస్త్రచికిత్సల కోసం 42 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో రూట్స్ సంస్థ కార్యదర్శులు ఎ.వినోద్‌కుమార్,ఎస్.సోనియా, సీఎస్ఆర్ మేనేజర్ రమాదేవి, మాజీ ఎంపీపీ నీలకంఠేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జోగింపేట మద్యం షాపు తనిఖీ


మద్యం సీసాల నిల్వలను పరిశీలిస్తున్న జేసీ ఎస్ఎస్ శోభిక

సీతానగరం: మండలంలోని జోగింపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేసిన నూతన మద్యం పాలసీలో భాగంగా కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమైన విషయం విదితమే. అందులో భాగంగా జోగింపేట మద్యం దుకాణాన్ని ఆమె సందర్శించి జాబితా ప్రకారం ఉండాల్సిన సరుకు ఉన్నదీ లేనిదీ ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాల్లో ఉండాల్సిన వన్నీ విధిగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యాన్ని విక్రయించాలని దుకాణ యాజమాన్యాలకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రసన్నకుమార్, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ సింహాచలం, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో మన్యం జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రైతు అంతరిక్ష స్థాయిలో ఉన్నాడని రాజకీయ నాయకులు, తెర వెనుకున్న హీరోలు చెబుతున్న బూటకపు మాటలు పచ్చి అబద్ధమని, రైతుల కష్టాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయన్నారు. అన్ని పథకాలకు గ్యారెంటీ ఇస్తున్న ప్రభుత్వాలు రైతుకు, పంటకు మాత్రం గ్యారెంటీ ఇవ్వలేకపోతున్నాయని, ఇది చాలా దుర్మార్గమని వాపోయారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రాము, రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు త్వరగా పూర్తిచేయాలి

సీతానగరం: గ్రామాల్లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీ త్రివిక్రమరావు తెలిపారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బగ్గందొరవలసలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో సర్పంచ్ ఎ.నారాయణరావుతో కలిసి ఇంకుడు గుంతల నిర్మాణానికి ఆయన టెంకాయ కొట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రెండు ఇంకుడు గుంతల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయని వాటిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఒక దానికి రూ.54వేలు వంతున మంజూరయ్యాయని తెలిపారు.

స్టడీ మెటీరియల్ వితరణ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు సన్నద్ధం అవుతున్న కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో సమకూర్చిన స్టడీ మెటీరియల్స్‌ను ఎంఈఓ సత్యనారాయణరావు అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా విద్యార్థులకు ఎస్.సొసైటీ వారు మెటీరియల్ పంపిణీ చేయడం శుభపరిణామమన్నారు. పాఠశాల హెచ్ఎం టి.శంకరరావు మాట్లాడుతూ... ఎస్ సొసైటీ అందిస్తున్న ప్రోత్సాహం, తమ ఉపాధ్యాయుల కృషి ఫలితంగా రెండేళ్లలో పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఉపాధ్యాయులు ఆకుల జగదీష్, శేఖర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడరాదు

• ఏఓ ప్రసాద్


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: వరి, పత్తి పంటల్లో మోతాదుకు మించి ఎరువులు వాడకూడదని మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని గుణద గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఆధారంగా పొలాలకు ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మండల కో ఆర్డినేటర్ గణేష్‌చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కె.మల్లేశ్వరరావు, రైతులు అప్పలస్వామి, వీఏఏ మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి రైతుల అవస్థలు

పాలకొండ: సాగునీటి కోసం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా తోటపల్లి ఎడమ కాలువ ద్వారా శివారు ప్రాంతాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల్లో పూడిక తీతలు చేపట్టలేదు. దీంతో రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం పొట్ట దశలోని వరి పంటకు రెండు అంగుళాల వరకు నీరు పెట్టాల్సి ఉండగా, సాగునీరు అందివ్వాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని రుద్రిపేట, వెలగవాడ, పరశురాంపురం, సింగన్నవలస గ్రామాల్లోని పంటపొలాలకు ప్రస్తుతం నీరు అందివ్వాల్సి ఉంది. పంటకు చేతికి వచ్చే సమయంలోనైనా అధికారులు స్పందించి, సాగునీరందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊరటనిచ్చిన వర్షం

భామిని:


బత్తిలిలో కురుస్తున్న వర్షం

ఎండలకు పంటలు ఎండిపోతున్న వేళ బుధవారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు కాస్త ఊరటనిచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. అయితే వర్షాలు మరీ ఎక్కువైతే ప్రస్తుతం పొట్ట దశలోని వరి పంటకు, పత్తి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రమదానం


బీటీ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్న వంతరగూడ యువత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వంతరగూడ గ్రామానికి చెందిన యువత బుధవారం ఉదయం శ్రమదానం చేశారు. ఎల్విన్‌పేట నుంచి డోకులగూడ మీదుగా పుట్టజమ్ముకు వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు పడుతున్న ఇబ్బందులు గుర్తించి శ్రమదానం చేసి జంగిల్స్ క్లీయరెన్స్ పనులు చేపట్టారు. వీరి శ్రమదానం పట్ల ఈ ప్రాంత వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వే భూముల్లో తప్పొప్పులకు అవకాశం

• తహసీల్దార్ (ఎఫ్ఏసీ) శేఖర్


గ్రామసభలో మాట్లాడుతూ తహసీల్దార్ (ఎఫ్ఏసీ) ఎన్.శేఖర్

గుమ్మలక్ష్మీపురం: గతంలో నిర్వహించిన రీ సర్వే భూముల్లో చోటుచేసుకున్న తప్పొప్పుల సవరణకు అవకాశం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ (ఎఫ్ఏసీ) ఎస్.శేఖర్ అన్నారు. మండలంలోని గుమ్మలక్ష్మీపురం, రేగులపాడు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన రీ సర్వేలో ఏమైనా తప్పొప్పులు నమోదై ఉంటే గ్రామసభల్లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలువురి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వీఆర్ఓ బి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

20 గ్రామాల్లో రీ సర్వే..

గుమ్మలక్ష్మీపురం మండలంలో 124 రెవెన్యూ గ్రామాలుండగా 20 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటివరకు భూముల రీ సర్వే పూర్తయిందని, మరో రెండు గ్రామాలు రీ సర్వే ప్రాసెస్‌లో ఉన్నాయని తహసీల్దార్ (ఎఫ్ఏసీ) ఎస్.శేఖర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల విస్తీర్ణంలో తేడాలు రావడం.. ఒకరి భూములు మరొకరి పేరిట నమోదవ్వడం.. తదితర సమస్యలుంటే తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలోని వంగరలో హెల్త్ సెంటర్ భవన నిర్మాణం కోసం సుమారు 20 సెంట్ల స్థలాన్ని, గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రం పరిసరాల్లో పీవీటీజీ హాస్టల్ నిర్మాణం కోసం 2 లేదా 3 ఎకరాల ప్రభుత్వ స్థలం గుర్తించాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ ఆదేశాలు జారీ చేశారని, ఆదిశగా తమ సిబ్బంది చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

విద్యార్థుల హాజరుశాతంపై ఏపీవో అసంతృప్తి


పొల్ల గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శనలో ఏపీవో చిన్నబాబు

వీరఘట్టం: మండలంలోని గంగంపేట ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు బుధవారం సందర్శించారు. అక్కడి తరగతుల నిర్వహణతో పాటు పాఠశాల పరిసరాలు, రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు తక్కువ మంది తరగతులకు హాజరు కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దసరా సెలవులు ముగిసినా పిల్లలు ఇంకా పాఠశాలకు రాలేదా అని ప్రశ్నించారు. వారు రాకపోతే వారు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్ పరిశీలించి, ఆహార నిల్వలు తనిఖీ చేసి, పిల్లలకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని సూచించారు.

సీతంపేట: మండలంలోని పొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు బుధవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దసరా సెలవుల అనంతరం ప్రారంభమైన తరగతులకు విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించి, ఇంటి నుంచి పాఠశాలకు వస్తున్న పిల్లలకు ఆరోగ్య తనిఖీలు చేయాలని తెలిపారు. ఎవరైనా ఏదైనా ఆరోగ్య సమస్యతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా వారి ఆరోగ్య సమస్యలను దూరంగా చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలన్నారు. అనంతరం తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మీనక భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.